తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ | ఆదివారం | 22 - 03 - 2026 | ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి | పేజీలు : 2




## దత్తప్పగూడెం గ్రామపంచాయతీకి

## వీడీబీ కంపెనీ ఆస్తి పన్ను బకాయి

# రూ.11.88 లక్షలు

### నాలుగేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించని కంపెనీ



గ్రామ పంచాయతీ కార్యాలయం : దత్తప్పగూడెం
మండలం: మోత్కూర్, జిల్లా యాదాద్రి భువనగిరి

నోటీస్

నుండి,
పంచాయితీ కార్యదర్శి,
గ్రా.పం. దత్తప్పగూడెం

వరకు,
శ్రీ ప్రాజెక్ట్ మేనేజర్,
వి.డి.బి. ప్రాజెక్ట్ ప్రై.లిమిటెడ్
దత్తప్పగూడెం.

తేది: 17.03.2026.

(House Tax) గత బకాయిలు (03) సం.ల మరియు ప్రస్తుతం సంవత్సరం మొత్తం పన్ను చెల్లించుటకు నోటీస్ జారీ చేయుట గురించి

సూచిక : 1.గ్రామ పంచాయితీ సాధారణ సమావేశం తీర్మానం తేది: 17.02.2026
2. పంచాయితీ రాజ్ చట్టం -2018.

@ @ @

గత (03) సంవత్సరాల ఇంటి పన్ను రూ.లు - 891333.00
ప్రస్తుతం సంవత్సరం ఇంటి పన్ను రూ.లు - 297111.00
మొత్తం ఇంటి పన్నుల రూ.లు - 1188444.00

- నేషనల్ హైవే 930పీ రోడ్డు పనులకు దత్తప్పగూడెంలో స్టాక్ పాయింట్
- మూడుసార్లు నోటీసులు ఇచ్చినా నో రెస్పాన్స్
- మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్
- నాలుగేళ్లుగా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు
- రెవెన్యూ రికవరీ చట్టంతో పన్ను వసూలు చేస్తారా..?

ప్రజావారధి/మోత్కూరు

పేద, మధ్య తరగతి ప్రజలు ఆస్తి పన్ను చెల్లించడంలో ఏ మాత్రం ఆలస్యమైనా ఇంటి చుట్టూ పదిసార్లు తిరిగి ముక్కు పిండి వసూలు చేసే అధికారులు... నాలుగేళ్లుగా ఓ కంపెనీ రూ.లక్షల్లో గ్రామపంచాయతీకి ఆస్తి బకాయి పడినా వసూలు చేయకపోవడంపై అనుమానాలకు, విమర్శలకు తావిస్తోంది. ఆస్తి పన్ను చెల్లించాలని ఆ కంపెనీకి మూడుసార్లు గ్రామపంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చినా ఎలాంటి వివరణ కూడా ఇవ్వడం లేదని తెలిసింది. కంపెనీ స్టాక్ పాయింట్ ఏర్పాటు కోసం మొదట్లో ఇచ్చిన ఎన్వోసీ గడువు కూడా ఏడాది క్రితమే ముగిసిందని చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే..

### 2022లో దత్తప్పగూడెంలో వీడీబీ కంపెనీ ఏర్పాటు

యాదాద్రి జిల్లా వలిగొండ గౌరెల్లి జంక్షన్ నుంచి (వలిగొండ-తొర్రూర్ రోడ్డు) భద్రాద్రికొత్తగూడెం వరకు నేషనల్ హైవే 930పీ రోడ్డు మంజూరు కాగా అందులో ఫేజ్-2 పనులను బెంగళూరుకు చెందిన వీడీబీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ దక్కించుకుంది. సుమారు రూ.350 కోట్లతో వలిగొండ నుంచి తొర్రూర్ వరకు 69 కిలోమీటర్ల రోడ్డు పనులు చేసేందుకు గాను వీడీబీ కంపెనీ దత్తప్పగూడెం వద్ద 2021 నవంబర్, డిసెంబర్ చివర్లో కంపెనీ స్టాక్ పాయింట్ ఏర్పాటు పనులను ప్రారంభించింది. సర్వే నంబర్లు 148, 149లో సుమారు 15 ఎకరాల స్థలం లీజ్‌కు తీసుకుని కంపెనీ కంకర క్రషర్లు, మిషన్లు, మెటీరియల్, ఆఫీసులు ఏర్పాటు చేసింది. 2022 నుంచి కార్యకలాపాలు ప్రారంభం కాగా ఆ సమయంలో గ్రామపంచాయతీ నుంచి ఎన్వోసీ కూడా తీసుకున్నారు. గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం 2022 నుంచి నేటి వరకు నాలుగేళ్లుగా కంపెనీ గ్రామపంచాయతీకి పైసా ఆస్తి పన్ను చెల్లించలేదు.

2లో..

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక

ఆదివారం


# జనరల్ న్యూస్

22 - 03 - 2026



## మొదటి పేజీ తరువాయి..

## రూ.11.88 లక్షల ఆస్తి పన్ను బకాయి



| క్ర.సం | నిర్మాణము పేరు | పొడవు | వెడల్పు | మొత్తం (చ.అ) |
|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 |
| 1 | స్టోర్ రూమ్ | 33 | 42 | 1386 |
| 2 | వంట గది | 79 | 26 | 2054 |
| 3 | క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్ | 61 | 36 | 2196 |
| 4 | ఆఫీస్ రూమ్ | 84 | 29 | 2436 |
| 5 | పంచర్ షెడ్ | 32 | 20 | 640 |
| 6 | వే బ్రిడ్జ్ | 15 | 10 | 150 |
| 7 | గది 1 | 15 | 100 | 1500 |
| 8 | గది 2 | 15 | 100 | 1500 |
| 9 | గది 3 | 33 | 10 | 330 |
| 10 | గది 4 | 33 | 10 | 330 |
| 11 | గది 5 | 25 | 10 | 250 |
| 12 | గది 6 | 21 | 15 | 315 |
| 13 | గది 7 | 30 | 15 | 450 |
| | | మొత్తం | | 13537 |


| క్ర.సం | కొలతలు | | రూ.లు | మొత్తం రూ.లు |
|---|---|---|---|---|
| 1 | నిర్మాణ స్థలం (చ.అ) | 13537 | 750 | 10152750.00 |
| 2 | ఖాళీ స్థలం (చ.గ) | 70385 | 700 | 49269500.00 |
| | మొత్తం (మూలధనం విలువ) | | | 59422250.00 |

మూలధనం విలువ పై (0 నుండి 1.00 రూ లు ) పన్ను విధించుకోవచ్చు
గ్రామ పంచాయతీ తీర్మానం ప్రకారం (0.50% పైసలు )పన్ను విధించబడింది

వీడీబీ కంపెనీ దత్తప్పగూడెం గ్రామ పంచాయతీకి 11 లక్షల 88 వేల 444 రూపాయల ఆస్తి పన్ను బకాయి పడింది. మొత్తం 15 ఎకరాల స్థలం లో 14 ఎకరాల్లో క్రషర్లు ఏర్పాటు చేసి కంకర నిల్వ, వాహనాల పార్కింగ్‌తో స్థలాన్ని ఇతర పనులకు వాడుకుంటుం డగా 14 ఎకరాల స్థలాన్ని ఖాళీ స్థలంగా పరిగణిం చగా, మిగతా స్థలంలో 7 గదులు, ఆఫీస్ రూం, క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్, స్టోర్ రూం, వంట గది, పంక్చర్ షాపు, వే్‌బ్రిడ్జి నిర్మించగా దాన్ని నిర్మాణ స్థలం కిందకు తీసుకుని పన్ను విధించారు. గత మూడు సంవత్సరాలకు గాను రూ.8 లక్షల 91 వేల 333 ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉండగా, 2026 సంవత్సరానికి గాను 2 లక్షల 97 వేల 111 రూపాయలు కలిపి మొత్తం 11 లక్షల 88 వేల 444 రూపాయల పన్ను చెల్లించాల్సి ఉంది.

## మూడుసార్లు నోటీసులు ఇచ్చినా నో రెస్పాన్స్


బకాయి పడిన ఆస్తి పన్ను చెల్లింపు కోసం దత్తప్పగూడెం గ్రామపంచా ఇయతీ నుంచి ఇప్పటి వరకు వీడీబీ కంపెనీకి మూడుసార్లు నోటీసులు ఇచ్చారు. గ్రామ సర్పంచ్ గుండు యాదగిరి అధ్యక్షతన పాలకవర్గం గత నెల 17న తీర్మానం చేసి ఈనెల 17న మరోసారి నోటీస్ జారీ చేయగా పంచాయతీ కార్యదర్శి కంపెనీ ఆఫీస్ రూంకు అంటించారు. ఇప్పటి వరకు మూడు నోటీసులు జారీ చేసినా కంపెనీ నుంచి మాత్రం ఎలాంటి స్పందన రావడం లేదంటున్నారు. కోట్ల టర్నోవర్ ఉన్న అంత పెద్ద కంపెనీ గ్రామ వనరులు వాడుకుంటూ కనీసం పంచాయతీకి చెల్లించాల్సిన పన్ను




కూడా చెల్లించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఈ విషయంలో ఇంత కాలం అధి కారులు పట్టించుకోకపోవడంలో ఉన్న మతలబు ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అంతపెద్ద కంపెనీ విషయంలో కేవలం కింది స్థాయి పంచాయతీ కార్యదర్శి లాంటి ఉద్యోగు లు ఏం చేస్తారని, పొలిటికల్ ఒత్తిడి కూడా ఉంటుందని, మండల, జిల్లాస్థాయి అధికారు లు జోక్యం చేసుకుని పన్ను వసూలు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రెవెన్యూ రికవరీ చట్టంతో పన్ను వసూలు చేస్తారా..?

ఇప్పటి వరకు మూడు నోటీసులు ఇచ్చినా వీడీబీ కంపెనీ స్పందించక పోవడంతో రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించి పన్ను వసూలు చేయాలని గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. పన్ను వసూలు విషయంలో సర్పంచ్ కూడా పట్టుద లతో ఉన్నట్టు తెలిసింది. ఆయన మండల, జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పనులు జరగ కుండా కంపెనీకి తాళం వేయాల ని, ఆస్తులను సీజ్ చేయాలని సర్పంచ్, వార్డు సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. కంపెనీ చేస్తున్న రోడ్డు పనులు కూడా దాదాపు పూర్తయ్యాయని, మరో రెండు, మూడు నెలల్లో మిషనరీని తరలించి దాన్ని మూసివేసే అవకాశాలు ఉన్నా యని, ఈలోపే బకాయిలను వసూలు చేయా లంటున్నారు. రూ.11.88 లక్షల ఆస్తి పన్ను వసూలైతే గ్రామాభివృద్ధికి ఉపయోగపడతా యని, కంపెనీ కూడా స్పందించి బకాయిలను చెల్లించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విష యమై కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ ను వివరణ కోరగా గ్రామపంచాయతీ నుంచి నోటీసులు అందాయని, విషయాన్ని యాజమా న్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు.



ఆఫీస్ వద్ద అంటించిన నోటీసులు

## వీడీబీ కంపెనీ బకాయిలను చెల్లించాలి -గుండు యాదగిరి, సర్పంచ్, దత్తప్పగూడెం

వీడీబీ కంపెనీ నాలుగేళ్లుగా గ్రామపంచాయతీకి ఎలాంటి పన్ను బకాయిలు చెల్లించలేదు. బకాయిల వసూలు కోసం గ్రామపంచాయతీ నుంచి సెక్రటరీ నోటీసులు ఇచ్చారు. ఎంపీడీవో, ఎంపీవోకు కూడా ఫిర్యాదు చేశాం. డీపీవో, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తాం. కంపెనీ కూడా స్పందించి వెంటనే బకాయిలను గ్రామపంచాయతీకి చెల్లించాలి.

## బకాయిలు వసూలయ్యేలా చర్యలు తీసుకుంటాం -జనార్దన్‌రెడ్డి, ఎంపీవో, మోత్కూరు

వీడీబీ కంపెనీ ఆస్తి పన్ను బకాయిల వసూలుపై పంచాయతీ సెక్రటరీ నోటీసులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ అధికారుల పాలన, గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం సమస్యగా మారింది. గ్రామపంచాయతీ పాలకవర్గంతో చర్చించి పన్ను బకాయిలు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటాం.